క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు భద్రగిరి విద్యార్థిని


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కీర్తితో ప్రిన్సిపాల్

గుమ్మలక్ష్మీపురం: కడపలో ఈనెల 7 నుంచి జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్ (పీటీజీ)లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బిడ్డిక కీర్తి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఎన్.సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఇటీవల సీతానగరంలో జరిగిన జిల్లా స్థాయి సౌత్ జోన్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పిడుగుపాటుకు కూలిన శ్లాబు


కూలిపోయిన ఇంటి పైకప్పును చూపుతున్న భాగ్యలక్ష్మి

పాలకొండ రూరల్: పట్టణంలోని లుంబూరువారి వీధికి చెందిన ఎస్.భాగ్యలక్ష్మికి చెందిన ఇంటిపై పిడుగు పడటంతో పైకప్పు శిథిలమైంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో పాటు పిడుగులు పడటంతో ఈ ప్రాంతలో పలువురికి చెందిన విద్యుత్ పరికరాలు, గృహోపకరణాలు ధ్వంసం అయ్యాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. స్థానిక వలంటీర్ కనుగుల తులసివేణి సమస్యలను సచివాలయం దృష్టికి తీసుకువెళ్లారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం..


రైతులను సముదాయిస్తున్న సీఐ ప్రసాద్

గరుగుబిల్లి: అర్హులైన రైతులకు న్యాయం జరుగుతుందని, అభివృద్ధికి ఆటంకం కలిగించొద్దని చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్ అన్నారు. గొట్టివలస రెవెన్యూ పరిధిలో పెదకొండ వద్ద అటవీశాఖకు అప్పగించిన 75.58 ఎకరాల భూమి హద్దులు నిర్ణయించేందుకు రెవెన్యూ అధికారులు బుధవారం కొండవద్దకు వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గొట్టివలస, ఉల్లిభద్ర గ్రామాలకు చెందిన పలువురు రైతులు అక్కడకు చేరుకుని సాగు చేస్తున్న భూములను అటవీశాఖకు ఎలా అప్పగిస్తారంటూ ఆందోళన చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అటవీశాఖకు భూములను అప్పగిస్తున్నట్లు డీటీ లక్ష్మీకుమార్ తెలిపారు. సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికను పంపినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని గడ్డికాలనీకి చెందిన గంటా లక్ష్మీ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. ఆమె పరిస్థితి తెలుసుకుని స్థానిక సర్పంచ్ బి.గౌరీ శంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, మద్ది దొరబాబు గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపులోని దాతల ద్వారా రూ.10 వేలు సేకరించి బుధవారం లక్ష్మీ తల్లి బుడ్డుకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిశోర్, వీఆర్వో బి.కృష్ణ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

సీతంపేట: బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో శతశాతం ప్రవేశాలు నమోదు కావాలన్నారు. ఈఓపీఆర్డీ సత్యం, ఎంఈఓ ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

సీతంపేట: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. మండలంలోని గొయిది గ్రామంలో బుధవారం జరిగిన 'జగనన్న ఆరోగ సురక్ష' వైద్యశిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి నిపుణులైన వైద్యులతో ప్రత్యేక వైద్యసేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని సచివాలయాల పరిధిలో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీటీసీ హరిబాబు, స్పెషల్ ఆఫీసర్ సింహాచలం, ఎంపీడీఓ కె.గీతాంజలి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, వైద్యాధికారి రవీంద్ర పాల్గొన్నారు.


భామిని: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శాంతికుమారి, సర్పంచ్

అందరికీ అందుబాటులో వైద్యం..

- పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని ఓని గ్రామ సచివాలయం పరిధిలో సర్పంచ్ కనపాక రవణమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. శిబిరానికి వచ్చిన వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, ఎంపీటీసీలు మజ్జి నవీన్‌కుమార్, పార్టీ నాయకులు గురునాయుడు, శేఖర్, చంద్రమౌళి, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరి, వైద్యులు కె.వెన్నల, చాందిని, శ్రావణి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.
- భామిని: మండలంలోని కాట్రగడ-బిలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీడీఓ జి.చంద్రరావు, డీటీ నిమ్మల శేఖరం పరిశీలించారు. శిబిరంలో అందిస్తున్న వైద్యసేవలు, రోగులకు కల్పించిన సౌకర్యాలపై ఆరాతీశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులకు శిబిరానికి తరలివచ్చి వైద్యసేవలు పొందారు.
- కొమరాడ: మండలంలోని గుమడ గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ దేవుపల్లి కళావతి బుధవారం ప్రారంభించారు. శిబిరంలో సుమారు 478 మందికి వైద్య సేవలు అందించారు. 15 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను ఉచితంగా అందజేశారు.
- కురుపాం: మండలంలోని ఒబ్బంగి పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 315 మందికి వైద్య సేవలందించారు. ఎంపీడీఓ వి.వి.శివరామప్ప, నీలకంఠాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సమరసింహారెడ్డి, మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రజ్ఞ, 104 సిబ్బంది, కెజీహెచ్ వైద్యులు రాహుల్, భవ్యశ్రీ, అభినవ్‌లు శిబిరంలో సేవలందించారు.
- గరుగుబిల్లి: మండలంలోని చినగుడబలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు పీఏ ప్రియాంక, కేకే సాగర్‌తో పాటు వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలందించారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ దవళ భాస్కరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పాలకొండ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధులకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్


సీతంపేట: వైద్యులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి


కొమరాడ: రోగులకు ఆరోగ్య సలహాలు అందిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్


గరుగుబిల్లి: చినగుడబలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ భాస్కరరావు


కురుపాం: ఒబ్బంగి గిరిజన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

ప్రతి ఇంటా సంక్షేమానందం

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- కొండాపురంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

పాలకొండ: ప్రభుత్వ పథకాలతో ఇంటింటా సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కొండాపురంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరు, స్థానిక సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పార్టీలకు అతీతంగా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలోని ప్రతీ గడపలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. జై జగన్ నినాదాలతో గ్రామం హోరెత్తింది.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడండి..

'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కొండాపురం సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో ఎమ్మెల్యే కళావతి సమావేశమయ్యారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాభివృద్ధికి కావాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాతలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశరావు, వాకముడి అనీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాసుబిల్లి జనార్దనరావు, వెలమల మన్మథరావు, తూముల లక్ష్మణరావు, కడగల రమణ, కిల్లారి మోహన్, కొంచాడ అరుణ్, పల్లా భాను, పతివాడ మోహనరావు, బచ్చల రాము, సాసుబల్లి శంకరరావు, మజ్జి వసంతరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గరుగుబిల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్ నుంచి గరుగుబిల్లి వరకు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను బుధవారం జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి మలుపుల వద్ద పిచ్చిమొక్కలు ఉండడంతో తరచు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు గుర్తించామని, ఎస్పీ ఆదేశాల మేరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడంతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.


ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద పిచ్చిమొక్కలు తొలగించిన దృశ్యం

వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిదీ..

గుమ్మలక్ష్మీపురం: అటవీ ప్రాంతాన్ని, అందులోని వన్య ప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అటవీశాఖ కురుపాం రేంజర్ మణికంఠ అన్నారు. సెక్షన్ ఆఫీసర్ భాస్కరరావు ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఎల్విన్‌పేట బీట్‌లో టేకు మొక్కల ప్లాంటేషన్‌ను, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రేంజర్ మణికంఠ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎలో వన్య ప్రాణులు, అడవుల సంరక్షణను పొందుపర్చడం జరిగిందన్నారు. వన్యప్రాణులు కూడా అడవిలో భాగమని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు పి.తిరుమల, ఎస్.రామారావు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ బి.త్రినాథ్ తదితరు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ రేంజర్ మణికంఠ

గర్భిణులకు సామూహిక సీమంతాలు


భామిని: గర్భిణులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి


గరుగుబిల్లి: చినగుడబలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

భామిని: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంకల్ప సప్తాహ' కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.కల్పనాకుమారి అన్నారు. భామిని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సమృద్ధి ఆహార మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. భామిని మండలం ఆశావహ బ్లాక్‌గా ఎంపికై నందున పౌష్టికాహార ఉత్సవాలు నిర్వహించాలని ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. సీడీపీఓ శాంతిభవానీ, డబ్ల్యూపీసీ చందన పట్నాయక్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కాట్రగడ-బిలో ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీడీఓ జి.చంద్రరావు, ఏపీఎం భవానీ ఆధ్వర్యంలో సమృద్ధి ఆహార మేళా నిర్వహించారు.

- గరుగుబిల్లి: మండలంలోని చినగుడబలో పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీఓ జి.సుగుణకుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు చేశారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, వైద్యులు కె.అరుణకుమారి తదితరులున్నారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న డప్పు కళాకారులు

భామిని: దళిత డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దీర్ఘాసి గణేశ్, జిల్లా నాయకుడు గొర్లె రవి కోరారు. ఈ మేరకు బుధవారం ఆందోళన చేపట్టారు. డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని, వాయిద్యాలు, డప్పులు, గజ్జెలు అందివ్వాలని కోరారు. డప్పు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి కళ అంతరించిపోకుండా చూడాలని కోరారు.

అవగాహనతో ప్రమాదాల నివారణ

పాలకొండ రూరల్: అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించొచ్చని అగ్నిమాపకశాఖ అధికారి సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక సిరి స్కూల్‌లో హెచ్‌ఎం పడాల రవికుమార్ ఆధ్వర్యంలో బుధవార అగ్నిప్రమాదాల నివారణపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రయాణికులు గమనించాలి

పార్వతీపురం టౌన్: పారాది వంతెన మరమ్మతుల కారణంగా పార్వతీపురం – విశాఖపట్నం మధ్య ఆర్టీసీ బస్సులు తిరిగే రూట్లు మార్చామని ప్రయాణికులు గమనించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ బుధవారం తెలిపారు. పల్లె వెలుగు బస్సులు పారాది వంతెన వరకు వెళ్తాయన్నారు. పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ సరీ్వసులను బొబ్బిలి, బాడంగి మీదుగా మళ్లించడం జరిగిందన్నారు. విశాఖపట్నం నుంచి పార్వతీపురం వచ్చే బస్సులు ఆకులకట్ట మీదుగా బొబ్బిలి, పార్వతీపురం చేరుకుంటాయన్నారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

పంట పొలాలను ఈకేవైసీ చేయించుకోవాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. పాపమ్మవలస, నిడగల్లు గ్రామాల్లో ఈకేవైసీ చేసేందుకు రైతులకు బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ మేరకు ఆయన పాపమ్మవలసలో మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో సాగు చేస్తున్న పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయడం పూర్తి కావచ్చినప్పటికీ ఈకేవైసీ చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఈకేవైసీ చేసిన పంటలకు పంట రుణాలు పొందవచ్చని, ప్రభుత్వం ఇస్తున్న వ్యసాయ సంక్షేమ పథకాలు పొందడానికి, రాయితీ అందిపుచ్చుకునేందుకు దోహదపడుతుందన్నారు. రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సాలూరు:

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్లు, ఇళ్లల్లో గ్యాస్‌ల వినియోగం పట్ల అశ్రద్ధ తదితర కారణాలతో అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి, వాటిని ఎలా నివారించాలి అనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు.కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు విధానాన్ని ప్రోత్సహించాలి

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేసినందున శత శాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలని ఏపీసీఎన్ఎఫ్ స్టేట్ సీనియర్ కన్సల్టెంట్ కె.రమాప్రభ అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయం వద్ద ఐసీఆర్‌పీలు, యూనిట్ లీడర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. రానున్న రెండేళ్లలో రైతులంతా వరి పంటతో పాటు అన్ని రకాల పంటలను ప్రకృతి వ్యవసాయ విధానంలోనే సాగు చేసేందుకు ప్రణాళికలు చేసినట్లు చెప్పారు. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులు, కషాయాలను వినియోగించేలా వారిని ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు.


మాట్లాడుతున్న ఏపీసీఎన్ఎఫ్ స్టేట్ సీనియర్ కన్సల్టెంట్ రమాప్రభ

క్రీడలతో మానసిక ఉల్లాసం

గుమ్మలక్ష్మీపురం: శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. విద్యార్థులు, యువత ప్రతీ రోజూ కొంతసమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.షణ్ముఖరావు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.


షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న సీఐ సత్యనారాయణ

అగ్ని అస్త్రంతో చీడపీడల నివారణ


సీతంపేట: కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న మండల యాంకర్


భామిని: అగ్ని అస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

భామిని: సేంద్రియ వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ సీఆర్‌పీలు తెలిపారు. మండలంలోని పోలవరం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే అగ్ని అస్త్రం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. గోమూత్రం, వేపాకు, పొగాకు, పచ్చిమిర్చి, తెల్లఉల్లి ఉపయోగించి అగ్ని అస్త్రం ద్రావణాన్ని ఎలా తయారు చేసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. పంటలను ఆశించే కాయతొలుచు పురుగు, కాండం తొలుచుపురుగు వంటి చీడపీడల నివారణకు ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంటీ ఆంభోజీ, ఎల్‌టీ గోవిందరావు, ఐసీఆర్‌పీ వి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని మండల యాంకర్ నరేష్ అన్నారు. మండలంలోని చాకలిగూడ గ్రామంలో రైతులకు బుధవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జిల్లేడు కషాయం తయారీ, దాని ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పద్మవతి పాల్గొన్నారు.

దేవానంద్‌కు గుర్రం జాషువ అవార్డు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని మండ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్‌కు గుర్రం జాషువా జాతీయ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వేదికలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్లు దేవానంద్ తెలిపారు. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా సాహిత్యం, గానం, సోషల్ వర్క్, నాట్యంలో ప్రతిభ కనపర్చిన వారికి ఏలూరు కల్చరల్ ఫౌండేషన్, జ్యోతి కల్చరల్ ఫౌండేషన్, ఇందిరా కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ అవార్డును అందజేస్తున్నాయి.